క్లుప్తంగా

కథ చెబుదామా...



స్టోరీ టెల్లింగ్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం : అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు కథలు గురించి అవగాహన కల్పించారు. రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించిన ప్రభరాజ్ స్టోరీ టెల్లింగ్‌కు సంబంధించి పలు అంశాలపై వివరించారు. గ్రంథాలయాధికారి కోటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి ఉత్సవాలకు బ్రాండిక్స్ విరాళం



విరాళం చెక్కును అందజేస్తున్న దొరైస్వామి

అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట అభయాంజనేయ స్వామి నవరాత్రి మహోత్సవాలకు బ్రాండిక్స్ భారత భాగ స్వామి దొరైస్వామి యాభై వేల రూపాయలను విరాళం అందించారు. ఈ సందర్భంగా ఉత్సవాలను తిలకించారు. శరగడం బాపునాయుడు, శరగడం నాగర్జున, ఆడారి నర్సింగ రావు, రవికుమార్, రాము పాల్గొన్నారు.

విద్యార్థులకు నీతి కథల బోధన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నూకినాయుడు

రాంబిల్లి : గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రీసోర్స్ పర్సన్ గల్లా నూకినాయుడు అన్నారు. దిమిలి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరంలో సోమవారం ఆయన విద్యార్థులకు నీతి కథలు చెప్పారు. పేదరికం వెంటాడినా అధిగమించి ఉన్నత స్థానాల్లో నిలిచిన ప్రముఖుల విజయగాథలను వివరించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎస్. శకుంతల తదితరులు పాల్గొన్నారు.

వంటలు రుచికరంగా ఉండాలి



మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచనలు చేస్తున్న ఎంఈవో -2 వరహాలబాబు

నాతవరం: పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం మెనూ అమలుతోపాటు విద్యార్థులకు రుచికరంగా వండి పెట్టాలని ఎంఈవో -2 కామిరెడ్డి వరహాలబాబు తెలిపారు. ఈ విషయమై సోమవారం స్థానిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సరుకులతో రోజూ మెనూ ప్రకారం వంటకాలు చేయాలన్నారు. కొన్ని పాఠశాలల్లో నిర్వాహకులు మొక్కుబడిగా వంటకాలు చేస్తున్నట్టు గతంలో ఫిర్యాదులు వచ్చాయన్నారు.

అలాంటి సంఘటనలు దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు సమావేశం ఏర్పాటు చేశామన్నారు. అనంతరం మండల స్థాయిలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు వంటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో డి.యర్రవరం హైస్కూల్ నిర్వాహకులు ప్రథమ, నాతవరం హైస్కూల్ నిర్వాహకులు ద్వితీయ స్థానంలో నిలిచారు. ఎంఈవో -2 వరహాలబాబు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. సీఆర్పీలు, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట



దార్లపూడి శివారులో వరాహనది పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న అధికారులు



ఇసుక ర్యాంపు దారిలో కాలువ తవ్విస్తున్న దృశ్యం

స్పందించిన అధికార యంత్రాంగం

సాక్షి ఎఫెక్ట్..

ఎస్.రాయవరం : దార్లపూడి శివారు వరాహనదిలో అక్రమ ఇసుక రవాణా అడ్డుకట్ట వేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. రెండు నెలలుగా నిరంతరాయం ఇసుక రవాణా చేస్తుండడంతో సోమవారం సాక్షి దినపత్రికలో సందట్లో సడేమియా....అనే శీర్షిక ప్రచురితమైంది. ఈ మేరకు ఇరిగేషన్ శాఖ నుంచి ఏఈ చిన్నారావు, కె.సూరిబాబు, భూగర్భ గనులశాఖ కె.రవికుమార్, రెవెన్యూ ఎం.జోగారావు, వీఆర్‌ఏ బి.చంటమ్మ, పోలీస్ శాఖ నుంచి ఎస్‌ఐ విభీషణరావు నదీ గర్భాన్ని పరిశీలించారు. నిత్యం ఇసుక తరలిస్తున్నట్టు గమనించడంతో వెంటనే చర్యలు చేపట్టారు. తాత్కాలికంగా నది నుంచి ఇసుక తెచ్చే దారులు పొక్లెయిన్‌తో తొలగించి అడ్డుకట్ట వేయించారు. ఇక ఈ ప్రాంతంలో ఇసుక తీస్తే చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు. అలాగే సోమిదేవపల్లి గ్రామం శివారులో ఉన్న వరాహనదిని కూడా పరిశీలించారు. ఇసుక మూటలు తీస్తే కేసులు బుక్ చేస్తామని హెచ్చరించారు.

కిశోర బాలికల ఆరోగ్యంపై అవగాహన



కోటవురట్లలో కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ కనకదుర్గ

కోటవురట్ల: కిశోర బాలికలు బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా రక్తహీనత నుంచి తప్పించుకోవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కనకదుర్గ సూచించారు. స్థానిక సంతబయలు వద్ద ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలు రుతుక్రమంలో తగు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు మంచి ఆహారాన్ని తీసుకోవాలన్నారు. శరీరంలో వచ్చే మార్పులను గమనిస్తూ అపోహలు పడకుండా అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహాలను అడ్డుకోవాలని, చదువు పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి : యలమంచిలి సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ రాంబిల్లి రూరల్ ఫీడర్ లైన్ విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం యలమంచిలి మున్సిపాలిటీ పరిధిలో కొన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీఈపీడీసీఎల్ డివిజనల్ ఇంజినీర్ కె.రాజశేఖర్ సోమవారం సాయంత్రం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలో సోమలింగపాలెం, కట్టుపాలెం, రామారాయుడుపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు. యలమంచిలి, కొత్తపాలెం యర్రవరం, యలమంచిలి పట్టణంలో వ్యవసాయ కనెక్షన్‌లకు కూడా ఉదయం 5 గంటల నుండి 8 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటలు నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా చేయబడుతుందని ఆయన తెలిపారు.

కాక రేపుతున్న కార్డన్ అండ్ సెర్చ్



కార్డన్ అండ్ సెర్చ్‌లో సీజ్ అయిన ద్విచక్ర వాహనాలు

36 వాహనాలు సీజ్

ఎస్.రాయవరం : సరైన పత్రాలు లేని వాహనాలపై పోలీసులు కొరడా ఝుళిపించారు. తాజాగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో 36 ద్విచక్ర వాహనాలు సీజ్ చేసినట్టు ఎస్‌ఐ విభీషణరావు చెప్పారు. తిమ్మాపురం, అడ్డురోడ్డు పరిసర ప్రాంతాల్లో నక్కపల్లి సర్కిల్ పరిధిలో పోలీసులు సోమవారం కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో 150 బైకులు చెక్ చేయగా 36 వాహనాలు సీజ్ చేసినట్టు చెప్పారు. ఈ సెర్చ్ జిల్లా ఎస్పీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు నిర్వహించినట్టు చెప్పారు. ఈ తనిఖీలను నక్కపల్లి సీఐ అప్పన్న పర్యవేక్షించారు.

గౌతమ పఠన మందిరంలో డ్రాయింగ్ శిక్షణ

మునగపాక : మునగపాకలోని గౌతమపఠన మందిరం ఆధ్వర్యంలో సోమవారం డ్రాయింగ్ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. వేసవి విజ్ఞానంలో భాగంగా మందిరం ఆవరణలో విద్యార్థులకు శిక్షణ ఏర్పాటు చేశారు. కొణతాల వెంకట సత్యనారాయణ, చదరం రామచంద్రరావు పర్యవేక్షణలో తరగతులు జరుగుతున్నాయి. ఈ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

పుస్తక పఠనం మంచి అలవాటు



కోటవురట్ల శాఖా గ్రంథాలయంలో నీతి కథలు వింటున్న విద్యార్థులు

కోటవురట్ల : స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. గ్రంథాలయాధికారి అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. రీసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించిన విశ్రాంత గ్రంథాలయాధికారి మురళీకృష్ణ నీతికథలు చదివి వినిపించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో గ్రంథాలయాల పాత్ర కీలకమన్నారు.

ప్రతి రోజు గ్రంథాలయ సందర్శన చేయడం ద్వారా విజ్ఞానాన్ని సొంతం చేసుకోవచ్చన్నారు. పుస్తక పఠనం అలవాటుగా మారి తరగతిలో చెప్పిన పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకునే అవకాశం కలుగుతుందన్నారు.

30 తులాల వెండి కాసులపేరు బహూకరణ



అమ్మవారికి కాసులపేరు అలంకరిస్తున్న జగన్నాథరావు, విజయ దంపతులు

కె.కోటపాడు: చౌడువాడ గ్రామ దేవత పెద పైడి మాంబ అమ్మవారికి గ్రామానికి చెందిన భక్తుడు తనకాల జగన్నాథరావు 30 తులాల వెండి కాసులపేరును బహూకరించాడు. ఇక్కడ ఆలయంలో అమ్మవారి విగ్రహానికి ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో సోమవారం దాత జగన్నాథరావు, దివ్య దంపతులు వెండి నగ అలంకరించారు. మహిమాన్వితం గల అమ్మవారికి రూ.35 వేలతో తయారు చేయించిన కాసుల పేరును బహూకరించడం అదృష్టంగా భావిస్తున్నట్టు వారు పేర్కొన్నారు.

క్షయ నివారణపై ప్రత్యేక దృష్టి

జిల్లా క్షయ వ్యాధి నివారణ సమన్వయకర్త అయ్యప్పరెడ్డి



వైద్యాధికారితో మాట్లాడుతున్న అయ్యప్పరెడ్డి

మాడుగుల రూరల్: క్షయ వ్యాధి నివారణపై ప్రత్యేక దృష్టి సారించామని జిల్లా క్షయ వ్యాధి నివారణ సమన్వయకర్త కె. అయ్యప్పరెడ్డి అన్నారు. సోమవారం ఆయన కె.జె.పురం పీహెచ్‌సీలో ల్యాబ్‌ను పరిశీలించారు. ఇక్కడ కేసులు వివరాలు గురించి వైద్యాధికారులు ప్రసాదుపాత్రుడు, లీలాప్రసాదులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అయ్యప్పరెడ్డి మాట్లాడుతూ క్షయ వ్యాధిగ్రస్తులకు పీహెచ్‌సీలో మందులు అందిస్తామన్నారు. వీరికి ప్రభుత్వం రూ.500 పింఛను అందిస్తుందన్నారు. పీహెచ్‌సీలో ఉచిత క్ష నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి సీహెచ్ పుష్పమ్మ, ల్యాబ్ టెక్నీషియన్లు నాయుడు, కోటి, సిబ్బంది ఈశ్వరరావు పాల్గొన్నారు.

సన్యాసమ్మ తల్లి ఒడ్డు పండగ వాయిదా



గ్రామ పెద్దలతో సమావేశమైన ఆలయ ధర్మకర్త లలితానాయుడు

దేవరాపల్లి: స్థానిక గ్రామ దేవత సన్యాసమ్మ తల్లి ఒడ్డు వండగను వచ్చే నెల 18న అంగరంగ వైభవంగా నిర్వహించాలని గ్రామ పెద్దలంతా నిర్ణయించారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం జూన్ 4న పండగ జరగాల్సి ఉంది. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో పాటు అదే రోజు ఓట్ల లెక్కింపు జరగనుండటంతో పండగ వాయిదా వేసుకోవాలని ఆలయ ధర్మకర్త వరదపురెడ్డి లలితానాయుడుకు ఎస్‌ఐ డి. నాగేంద్ర సూచించారు. ఆ మేరకు స్థానిక రామాలయంలో గ్రామ పెద్దలతో సోమవారం సమావేశం నిర్వహించారు. గ్రామ పెద్దల అభిప్రాయం మేరకు వచ్చే నెల 18న అమ్మవారి ఒడ్డు పండుగ నిర్వహించాలని నిర్ణయించారు. ఆ రోజున పసుపు కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకోవాలని ఆలయ ధర్మకర్త విజ్ఞప్తి చేశారు. సమావేశంలో డాక్టరు వరదపురెడ్డి సింహాచలంనాయుడు, మహేశ్వరీ నాయుడు, కె.వి.రమణ, జాగరపు అబద్ధం, చొక్కాకుల రమణ తదితర గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు మనోవికాసానికి దోహదం



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఉపాధ్యాయులు



మ్యూజికల్ చైర్ ఆడుతున్న చిన్నారులు

యలమంచిలి : గ్రంథాలయాలు విద్యార్థుల మనోవికాసానికి ఎంతో దోహదపడతాయని సీనియర్ ఉపాధ్యాయులు రత్నరాజుఅన్నారు. యలమంచిలి శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ తరగతులను ఆయన ఫిజికల్ డైరెక్టర్ దుర్గారావుతో కలిసి సోమవారం విద్యార్థులకు పుస్తక పఠనం, ఇంగ్లిష్ గ్రామర్, నీతి కథలు బోధించారు. అనంతరం విద్యార్థులకు మ్యూజికల్ చైర్ వంటి ఆటలను ఆడించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నిర్వహిస్తున్న ఈ వేసవి శిక్షణ శిబిరం వారిలో విజ్ఞానాన్ని పెంపొందించడానికి ఎంతో తోడ్పడుతుందన్నారు. విద్యార్థుల్లో మానసిక ఉల్లాసానికి, వారిలో ఒత్తిడిని పారదోలడానికి ఇండోర్ గేమ్స్ వంటి ఆటలు ఉపయోగపడతాయని అన్నారు. విద్యార్థులందరూ వారికి ఇష్టమైన విభాగాల్లో శిక్షణ పొంది నైపుణ్యం పెంచుకోవాలని, అలాగే గ్రంథాలయాన్ని ఉపయోగించుకని ఆంగ్ల భాషపై పట్టు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వి.ఆనంద్ పాల్గొన్నారు.

తిమ్మరాజుపేటలో ఉపాధి హామీ పనులు



ఉపాధి హామీ పనులు చేపడుతున్న దృశ్యం

అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేటలో సోమవారం గ్రామీణ ఉపాధి హామీ పనులు ప్రారంభం అయ్యాయి. ఇటీవల తిమ్మరాజుపేట సచివాలయం వద్ద ఉపాధి హామీ పనులు చేపట్టాలని నిర్వహించిన ధర్నా ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. దీంతో ఎంపీడీవో సురేశ్‌కుమార్ ఆదేశాల మేరకు వీఆర్పీ రామలక్ష్మి పర్యవేక్షణలో పనులు ప్రారంభించారు. ఏపీవో టి.వసంతకుమార్, టి.ఎ వెంకటరావుతో పాటు స్థానిక ప్రతినిధులు శరగడం శివ బాపునాయుడు, కర్రి అప్పారావు, జగ్గారావు, ఆర్. రాము పాల్గొన్నారు.

పంచాయతీ రికార్డుల పరిశీలన



పాయకరావుపేట పంచాయతీలో రికార్డులను పరిశీలిస్తున్న ఈవోఆర్‌డీ



లేఅవుట్‌లను పరిశీలిస్తున్న ఈవోఆర్‌డీ

పాయకరావుపేట : పాయకరావుపేట పంచాయతీ రికార్డులను పరిశీలించినట్టు ఈవోఆర్‌డీ సిహెచ్.చంద్రశేఖర్ తెలిపారు. రికార్డులు తనిఖీ చేసి ఇంటి పన్నులు వసూలు, బకాయిలు జమ ఖర్చులు తదితర అంశాలకు చెందిన రికార్డులను పరిశీలించారు. అనంతరం పాయకరావుపేట, సీతారాంపురం, శ్రీరాంపురం గ్రామాల పరిధిలో వేస్తున్న లేఅవుట్‌లను పరిశీలించి, ఆయా గ్రామాల కార్యదర్శులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చి, నిబంధనల ప్రకారం లేఅవుట్‌లు ఉండేటట్లు పరిశీలించాలని కార్యదర్శులను ఆదేశించినట్టు ఈవోఆర్‌డీ చంద్రశేఖర్ తెలిపారు.

నేడు పెద పైడిమాంబ పెద్ద పండగ

జిల్లా నలుమూలల నుంచి తరలిరానున్న భక్తులు



పెద పైడిమాంబ అమ్మవారి ఆలయం



గ్రామంలో విద్యుద్దీపాలంకరణ

కె.కోటపాడు: చౌడువాడ గ్రామ దేవత పెద పైడి మాంబ అమ్మవారి పెద్ద పండగను మంగళవారం ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అమ్మవారి పండగను ఐదేళ్లకోసారి నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా ఆది, సోమవారాల్లో ఇక్కడ ఆలయ ప్రాంగణంలో భారీ ప్రభ ప్రదర్శించారు. ఊరికట్టు కార్యక్రమాన్ని సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. ఇతర ప్రాంతాలకు ఉద్యోగ, ఉపాధి నిమిత్తం వెళ్లిన వారు అమ్మవారి పెద్ద పండగ సందర్భంగా తిరిగి గ్రామానికి చేరుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది. జిల్లాతోపాటు ఇతర జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు. మరోవైపు గ్రామాన్ని, గుడిని విద్యుద్దీపాలంకరణతో ముస్తాబు చేశారు. అమ్మవారి ఆలయంలో దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా గ్రామ పెద్దలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు కె.కోటపాడు ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

సంపద తయారీ కేంద్రాలను అభివృద్ధి చేయాలి

ఎంపీడీవో జాన్ లింకన్



పంచాయతీ కార్యదర్శులతో సమావేశమైన ఎంపీడీవో జాన్ లింకన్

రోలుగుంట: చెత్తతో సంపద తయారీ కేంద్రాలను మరింత అభివృద్ధి చేసి వినియోగంలోకి తేవాలని ఎంపీడీవో జాన్ లింకన్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో కార్యదర్శులతో సమీక్షించారు. ఈ సందర్భంగా పంచాయతీల వారీగా చెత్తతో సంపద తయారీ కేంద్రాల ప్రస్తుత పరిస్థితులపై చర్చించారు. ప్రతి కార్యదర్శి సంపద తయారీ కేంద్రాల అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. వారం రోజులుగా పడుతున్న వర్షాల నేపథ్యంలో వీధి కాలు వల్లో గాని, గ్రామాల్లో గాని ఎక్కడైనా నీటి నిల్వలు లే కుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజ లకు తాగునీరు సరఫరా అయే వాటరు ట్యాంకులను శుద్ధి చేయాలన్నారు. వీధుల్లో ఎక్కడా చెత్తకుప్పలు ఉండకుండా సంపద తయారీ శాలలకు తరలించాలన్నారు. కాలువల్లో పూడికలు తీయించాలన్నారు. పంచాయతీ అభివృద్ధికి సంబంధించిన రికార్డులను అప్‌డేట్ చేయాలన్నారు. సచివాలయాలను చెత్తతో సంపద తయారీ శాలలను పర్యవేక్షించి అవసరమైన సూచనలు చేయాలని ఈవోపీఆర్డీ నూకరాజుకు సూచించారు.

హ్యాక్‌థాన్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



సాధించిన ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

సబ్బవరం: ఆంధ్రా విశ్వవిద్యాలయంలోని ఇంక్యుబేషన్ సెంటర్‌లో ఈ నెల 26న రాష్ట్రస్థాయిలో నిర్వహించిన హ్యాక్‌థాన్ పోటీల్లో సబ్బవరం ప్రతిభా విద్యాలయం విద్యార్థులు తమ సత్తాచాటారు. అటల్ టింకరింగ్ ఇన్నోవేషన్ ప్రదర్శనలో భాగంగా రోబోటిక్స్ విభాగంలో కె. అభిషేక్ బృందం ఆవిష్కరించిన అగ్రి రోబోటిక్స్ అత్యుత్తమ ప్రదర్శనల్లో నిలిచిన 5 టీమ్‌లలో మూడో స్థానంలో నిలిచిందని పాఠశాల కరస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ తెలిపారు. అటల్ టింకరింగ్ ల్యాబ్ ఇన్‌చార్జ్,పాఠశాల సైన్స్ టీచర్ బోకం తులసీ ప్రియాంక నేతృత్వంలోని కాపల అభిషేక్(పదోతరగతి),లగుడు మోహన్ వంశీ(9వ తరగతి),బొడ్డేటి కావ్యప్రియ(8వ తరగతి),జి జ్ఞాన సాత్విక్(7వ తరగతి) బృందం ఆవిష్కరించిన అగ్రి రోబోటిక్ నమూనాకు గుర్తింపు లభించిందన్నారు. వ్యవసాయ రంగంలో పంట నమూనాల సేకరణ నుంచి ఆయా పంటల నాట్లు, పంట చేతికి వచ్చే వరకూ అన్ని రకాల పనులు ఈ రోబోటిక్స్ చేసేవిధంగా నమూనాను ఆవిష్కరించారన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను సోమవారం ఆయన అభినందించారు.